క్లుప్తంగా

దేవీలాల్‌తండా సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి..



పర్వతగిరి : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలంలోని దేవీలాల్‌తండా వాసులు తండాలో నెలకొన్న సమస్యలను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు దృష్టికి తీసుకెళ్లారు. తొలుత ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం తండాలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా తండావాసులతో ఎమ్మెల్యే మాట్లాడారు. తండాలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తండా శివారులోని ప్రభుత్వ భూమిలో స్మశాన వాటిక నిర్మించుకోవాలని చెప్పారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఇస్లావత్ దేవీలాల్, చక్రు, హరీష్, తదితరులున్నారు.

ఎస్టీ హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

పర్వతగిరి : మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని హెచ్ఎం సురేశ్, హాస్టల్ సుధాకర్ కోరారు. ఈ మేరకు వారు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు స్పందించారు. అధికారులతో మాట్లాడారు. హాస్టల్‌కు అవసరమైన వసతులు, మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, బీసీ సెల్ నాయకుడు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీత్లా పండుగ



సంగెం : మండలంలోని వీఆర్‌ఎన్ తండావాసులు మంగళవారం సీత్లా పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గిరిజన మహిళలు నైవేద్యాన్ని వండి బోనాలను తీసుకెళ్లి దేవతకు సమర్పించారు. దేవతలకు చుట్టిన గొర్రెల పేగులపై నుంచి పశువులను దాటించి పాడి పశువులు చల్లంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గుగులోత్ వీరమ్మ, మాజీ సర్పంచ్ బిచ్యానాయక్, అభినవ్ పాల్గొన్నారు.

పీరీల ఊరేగింపు

సంగెం : మొహర్రం సందర్భంగా మండలంలోని గవిచర్ల, ఎల్గూర్ రంగంపేట, తీగరాజుపల్లి, చింతలపల్లి, నల్లబెల్లి, సంగెం తదితర గ్రామాల్లో పీరీలను డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగించారు. ఇంటింటికీ పీరీలతో దువా ఇచ్చారు.

హజరత్ అలీ దీపారాధన

దుగ్గొండి : మొహర్రం సందర్భంగా మండలంలోని తిమ్మంపేటలో మంగళవారం రాత్రి హజరత్ అలీ దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. బానోజీపేట, తిమ్మంపేట గ్రామాలకు చెందిన పీరీలు (సవార్లు) దీపారాధన కార్యక్రమంలో పాలుపంచుకున్నాయి. పీరీలు ఎత్తుకున్న భక్తులు అగ్నిగుండంలోని నిప్పులపై నడిచారు. కార్యక్రమంలో జబ్బార్, ఫారూక్, సారయ్య, షరీఫ్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలో వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిపై సీఐ బుర్ర రాజగోపాల్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల పత్రాలను పరిశీలించారు. డ్రైవర్లకు డంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్ రవాణాను అరికట్టడానికి తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, ఇతర నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. ఆయన వెంట ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

మొరం అక్రమ తరలింపు

రాయపర్తి (వర్ధన్నపేట) : వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని నీలగిరిస్వామి తండా శివారు ఎస్సారెస్పీ కెనాల్ కోసం నిల్వ ఉంచిన మొరంను అక్రమంగా తరలిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హిటాచీ, టిప్పర్లతో వరంగల్‌కు అక్రమంగా మొరం తరలిస్తున్నట్లు స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. అనుమతి ఉందని చెబుతున్నా రాయపర్తి మండలంలో మొరం తరలింపునకు అనుమతి తీసుకుని వర్ధన్నపేట పరిధిలో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి అక్రమానికి పాల్పడుతున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యక్షుడి నియామకం

నర్సంపేట : మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పెరుమాండ్ల రవి నియమితులయ్యారు. ఈ మేరకు రవికి వరంగల్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడారు. రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

బాలలను అంగన్‌వాడీల్లో చేర్పించాలి



నర్సంపేట : మాట్లాడుతున్న భారతి



దుగ్గొండి : ర్యాలీలో టీచర్, తదితరులు

నర్సంపేట : చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని అంగన్‌వాడీ టీచర్ నల్ల భారతి కోరారు. 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' లో భాగంగా నర్సంపేట-4 అంగన్‌వాడీ కేంద్రంలో ఏఎల్ఎంఎస్‌సీ కమిటీ సభ్యులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో భారతి మాట్లాడారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలు పూర్వప్రాథమిక విద్యా కేంద్రాలుగా నడుస్తున్నాయని తెలిపారు. చిన్నారులకు ఉచితంగా యూనిఫామ్, ఒక పూట భోజనం, గుడ్లు, స్నాక్స్ అందిస్తున్నామని చెప్పారు. మూడు నుంచి ఐదేళ్ల వరకు వయస్సున్న బాలలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపి వారి శారీరక, మానసిక, సాంఘిక వికాసానికి బాటలు వేయాలని ఆకాంక్షించారు. ఆటపాటలతో విద్య అందించనున్నట్లు తెలిపారు. మాజీ కౌన్సిలర్ వాసం కరుణ మాట్లాడుతూ తల్లులు అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్ఎల్ఎఫ్ అధ్యక్షురాలు, ఏఎల్ఎంఎస్‌సీ సభ్యురాలు క్యాతం తేజశ్రీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో లభిస్తున్న సదుపాయాలను అర్హులు వినియోగించుకోవాలని చెప్పారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్ గౌసియా, ఆయా సునీత, ఆర్‌పి రజిత, ఏఎల్ఎంఎస్‌సీ సభ్యులు బొర్ల మానిక, వంకేశి అనిత, ఆశవర్కర్ రమ, ఎస్ఎల్ఎఫ్ సభ్యులు అడ్డగట్ల భాగ్య, కవిత, సుజిత, మానస, తాహెరా, లక్ష్మి, అనీసా కౌసర్, సూరున్, వద్య పాల్గొన్నారు.

ర్యాలీ

దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేటలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ సోమ స్వరూప మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఒత్తిడి లేని విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల నిలయంగా కళాశాల



కళాశాల ఎదుట బురదలో కూర్చుని నిరసన తెలుపుతున్న నాయకులు

నర్సంపేట : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలకు నిలయంగా తయారైందని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, డీవైఎఫ్ఐ నాయకుడు గద్దమీది బాలకృష్ణ ఆందోళన వెలిబుచ్చారు. పట్టణంలోని ద్వారకాపేట రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఏబీఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం బురదలో కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నరేశ్, బాలకృష్ణ మాట్లాడారు. కళాశాలలో వివిధ మండలాల నుంచి సుమారు 350 మంది పేద విద్యార్థులు అడ్మిషన్ తీసుకున్నారని చెప్పారు. కళాశాల భవనం శిథిలావస్థలో ఉందని, ఇటీవల కురిసిన వర్షాలకు తరగతి గదుల పెచ్చులూడిపోయాయని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం లేవని తెలిపారు. ప్రభుత్వ కళాశాలలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఇకనైనా కళాశాలకు నూతన భవనం నిర్మింపజేయాలని, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, వినయ్, శ్రీకాంత్, ప్రసాద్, రఘు, శ్రీధర్, మురళి, ప్రవళిక, భాగ్యలక్ష్మి, రజియా, కావ్యశ్రీ, అనిత, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



పర్వతగిరి : వినతిపత్రం ఇస్తున్న నాయకులు



రాయపర్తి : ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పర్వతగిరి : కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల సందర్భంగా ముదిరాజ్ కులస్తులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ముదిరాజ్ మహాసభ ఎస్ఆర్ఐ విభాగం రాష్ట్ర కన్వీనర్ కానబోయిన రాజ్‌కుమార్, అధ్యక్షుడు పొన్నం మొగిలి డిమాండ్ చేశారు. మండలంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్, మొగిలి మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చుతామని, ఇతర అనేక హామీలు ఇచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు చొప్పరి సోమన్న, మత్స్య శాఖ జిల్లా డైరెక్టర్ అల్లాడి నర్సయ్య, యూత్ విభాగం జిల్లా కార్యదర్శి గుండాల రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బండారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఐ విభాగం రాష్ట్ర కన్వీనర్ కానబోయిన రాజ్‌కుమార్, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు పొన్నం మురళి మాట్లాడారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు చొప్పరి సోమయ్య, నాయకులు చెవ్వ కాశీనాథం, ముద్రబోయిన సుధాకర్, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, జంగిలి నరేష్, చెవ్వ యాకయ్య, బోయిని కుమార్, శాపురం సాయిలు, నర్సింహుల రమేష్, భీమని యాదగిరి, పిట్టల వెంకటయ్య, నారబోయిన యాకయ్య, వెంకన్న, నర్సింహుల రామ్మూర్తి, మిట్టపల్లి వెంకన్న, కుక్కల అంజయ్య, బాధ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌కు ఘనసన్మానం



నర్సంపేట : స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మూడోసారి ఎన్నికైన సందర్భంగా పాలాయి శ్రీనివాస్‌ను కాంగ్రెస్ పార్టీ మగ్దుంపురం గ్రామ నాయకులు పార్టీ కార్యాలయంలో మంగళవారం పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చీకటి స్వరూప ఓదయ్యగౌడ్, మాజీ ఉపసర్పంచ్ వంగావత్ తిరుపతినాయక్, చెన్నారావుపేట సొసైటీ డైరెక్టర్ ఇస్లావత్ గోపినాయక్, కాంగ్రెస్ పార్టీ మగ్దుంపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు వరంగంటి కుమారస్వామి, ఉపాధ్యక్షుడు ఇస్లావత్ నరాస్, కానపల్లి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు..



నెక్కొండ : మండలంలోని పత్తిపాక మాజీ సర్పంచ్ లావుడ్య సరిత దంపతులను పంచాయతీ కార్యాలయంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మాజీ సర్పంచ్ సరిత మాట్లాడారు. మహిళా సంఘాలు ప్రభుత్వ ప్రోత్సాహాన్ని వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మహిళా సంఘాలు మహాసభలు నిర్వహించుకునేందుకు కుర్చీలు కూడా లేకపోవడంతో సుమారు రూ.10 వేల విలువైన 30 కుర్చీలు అందించామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు లావుడ్యా తిరుమల్ చౌహాన్, ఏపీఎం శ్రీనివాస్, జీపీ కార్యదర్శి వంటేరు రాకేష్, బొల్లెబోయిన సురేష్, వసునూటి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు..



ఖానాపురం : మండలంలోని మంగళవారిపేట గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్ ఉపాధ్యాయులు సుధాకర్, కీర్య, సురేందర్ బదిలీ కాగా వారిని హెచ్ఎం మంజుల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మంజుల మాట్లాడారు. ఉపాధ్యాయులుగా ఎనలేని సేవలు అందించారని అభినందించారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సహజమని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజలింగం, దేశ్యా, సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

డీటీ వెంకటేశ్‌పై చర్యలు తీసుకోవాలి



చెన్నారావుపేట : నల్లబ్యాడ్జీలతో ఉద్యోగులు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిబ్బంది

● నల్లబ్యాడ్జీలు ధరించి ఉద్యోగుల నిరసన

చెన్నారావుపేట : కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలోని తహసీల్దార్ కార్యాలయ రికార్డ్ అసిస్టెంట్ ప్రశాంత్ ఆత్మహత్యకు కారకుడైన డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడారు. ప్రశాంత్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో గిర్దావర్ చెన్నమల్ల స్వామి, జూనియర్ అసిస్టెంట్ కోరె శోభారాణి, ధారావత్ సంతోష్, ద్యాగల రాజు, రికార్డ్ అసిస్టెంట్ చాగంటి శివకోటి, మండల చిన్న నర్సింహస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

పర్వతగిరి : తహసీల్దార్ కార్యాలయ రికార్డు అసిస్టెంట్ ప్రశాంత్‌ను వేధింపులకు గురి చేసిన డీటీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తహసీల్దార్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. ప్రశాంత్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కస్నా, జూనియర్ అసిస్టెంట్లు శంకర్, సుమతి, రమేష్, నజ్మా, చైత్య, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సదుపాయాలు కరువు

పర్వతగిరి : మండలంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కరువయ్యాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ ఆందోళన వెలిబుచ్చారు. ఆ పాఠశాలను ఆ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సందర్శించి సమస్యలపై అధ్యయనం చేశారు. అనంతరం ప్రశాంత్ మాట్లాడారు. విద్యార్థుల సంఖ్యకు అనుకూలంగా బాత్‌రూమ్‌లున్నా వాటికి తలుపులు లేవన్నారు. సుమారు 200 మంది విద్యార్థులుండగా కేవలం నాలుగు నల్లాలు మాత్రమే ఉన్నాయని చెప్పారు. ఇప్పటివరకు విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వలేదని తెలిపారు. సమస్యలను ప్రిన్సిపాల్, వార్డెన్ దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదన్నారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని చెప్పారు. గోడలకు పెచ్చులూడిపోయాయని, కిటికీలు లేవని వివరించారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి ఎద్దు రాహుల్, నాయకులు సతీష్, అఖిల్, నిఖిల్, శివ, కిరణ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థిని మృతి అనుమానాస్పదం'

నర్సంపేట : సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని దోసపాడు బీసీ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థిని కొంపల్లి సరస్వతి మృతి అనుమానాలకు తావిస్తోందని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్ తెలిపారు. మృతిపై తక్షణమే సమగ్ర విచారణ చేయించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో అజయ్ మాట్లాడారు. జ్వరం వచ్చిన రెండు గంటల్లోనే మృతి చెందడంపై విచారణ చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్, జీఎన్ఎంలను సస్పెండ్ చేయాలని, బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడాది వ్యవధిలోనే సూర్యాపేట జిల్లాలో 8 మంది విద్యార్థులు సంక్షేమ, గురుకుల హాస్టళ్లలో మృతి చెందారని తెలిపారు. అధికారులు పూర్తిస్థాయిలో విచారించకపోవడం వల్లే మరణాలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు.

బ్యాగులు, వాటర్ బాటిళ్ల పంపిణీ



విద్యార్థులతో వెంకన్న-హైమ దంపతులు

చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బాల్నె వెంకన్న-హైమ దంపతులు కెనడాలో ఉంటున్న వారి మనువడు ఈశాన్ మొదటి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం బ్యాగులు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మురహరి రవి, కడారి సాయిలు, అమ్మ రాజేష్, మేడి సతీష్, గుండెబోయిన రమేష్, జన్ను నరేష్, హెచ్ఎం రవి, ఉపాధ్యాయులు విజయకుమారి, శైలజ, హఫీజ, అంగన్‌వాడీ టీచర్లు రాధిక, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్‌కు పితృవియోగం

సంగెం: రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు తండ్రి సుబ్బారావు అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం మరణించారు. మండలంలోని గుంటూరువల్లిలో సుబ్బారావు పార్థివదేహాన్ని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, రైతు రుణవిమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్‌రావు, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్‌గౌడ్ తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నాటుసారా తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

నెక్కొండ : మండలంలోని టీకేతండా పంచాయతీ పరిధిలోని ఇంద్యాతండాకు చెందిన బానోతు మంజుల, గుగులోతు వెంకన్న నుంచి 90 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ఇద్దరినీ అరెస్ట్ చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఇద్దరూ నాటుసారా రవాణా చేస్తుండగా మండల కేంద్రంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

దుగ్గొండి : ఈనెల 20న నర్సంపేటలో, 22న దుగ్గొండిలో నిర్వహించనున్న ముదిరాజ్ మహాసభ సభలను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు వల్లె రమేశ్ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్ కులస్తులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే డిమాండ్‌తో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభలకు కులస్తులు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాల స్వామి, మంద భిక్షపతి, ముద్రబోయిన నర్సింహస్వామి, రెడ్డి అశోక్, ఈర్ల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్‌కు చెందిన కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కర్నూరి సంపత్‌రెడ్డి ఇటీవల కాలుకు శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం కలిసి పరామర్శించారు. సంపత్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సదయ్య, ఉపాధ్యక్షులు రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీలో కొర్రీలు సరికాదు

నల్లబెల్లి : రైతులకు రూ.2 లక్షలలోపు రుణమాఫీ చేసే విషయంలో కొర్రీలు తగదని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి అన్నారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు రైతులను మోసగించేవిలా ఉన్నాయని తెలిపారు. రుణమాఫీకి రేషన్ కార్డు ప్రతిపాదికగా తీసుకోవడం సరికాదన్నారు. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా అర్హులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్సైకి అభినందన

నల్లబెల్లి : స్థానిక ఎస్సై ప్రశాంత్ బాబును పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం కలిసి అభినందనలు తెలిపారు. ఎస్సైకి సారంగపాణి, ఇతర నాయకులు పూలబొకే అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కోటిలింగాచారి, మండల అధ్యక్షుడు క్యాతం శ్రీనివాస్, నాయకులు ఊడుగుల ప్రవీణ్ గౌడ్, గందె శ్రీనివాస్ గుప్తా, మామిండ్ల మోహన్‌రెడ్డి, తక్కళ్లపల్లి మోహన్‌రావు, నానబోయిన రాజారాం, నల్ల శ్రీనివాస్ గౌడ్, ఆకుల సాంబరావు, బట్టు సాంబయ్య, వైనాల వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

గీసుకొండ : మండలంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు. ఈ మేరకు అధికారులు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మనుగొండ కార్యదర్శి సరిత మరియపురం గ్రామానికి, మనుగొండకు షకీల్, బొడ్డుచింతలపెల్లి కార్యదర్శి యాదలక్ష్మి గీసుకొండకు, ఎలుకుర్తి కార్యదర్శి కల్యాణి బొడ్డుచింతలపెల్లికి, మరియపురం కార్యదర్శి స్వప్న ఆరెపల్లికి, దస్రు తండా కార్యదర్శి సహజ దుగ్గొండికి, గీసుకొండ కార్యదర్శి వేణుప్రసాద్ గిర్నిబావికి బదిలీ అయ్యారు. వారికి ఉత్తర్వులు అందాల్సి ఉంది.

రక్షణ కవచాల పంపిణీ హర్షణీయం

చెన్నారావుపేట : గీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కవచాలు పంపిణీ చేయడం హర్షణీయమని నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మండల యాకయ్య, గౌడ సంఘం జిల్లా నాయకులు జోరు వీరయ్య అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సేఫ్టీ మోకులు అందించడం అభినందనీయమని తెలిపారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్య పరిరక్షణ



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఖానాపురం : పరిసరాల శుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉండగలమని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృందం టీం లీడర్ నెల్లుట్ల సుమన్ స్పష్టం చేశారు. మండలంలోని రాగంపేట, తదితర గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమాల్లో బృందం పాటలతో ప్రజలకు అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, తదితర సూచనలు చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో కళాకారులు తాళ్ల సునీల్, పడిదం రాజేందర్, గొట్టిముక్కల యోచన, గాదె పాక బాబు, బరిగెల రవీందర్ పాల్గొన్నారు.

ప్రజలను పోరాటాలకు సన్నద్ధం చేయాలి

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను పోరాటాలకు సన్నద్ధం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ కోరారు. పట్టణంలో ఇల్లందుల సాంబయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశానికి రమేష్ అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. ప్రజాసమస్యలు పరిష్కరించడంతోపాటు నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ఈనెల 26, 27 తేదీల్లో నెక్కొండలో నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమాజం, ప్రజాసమస్యలు, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అక్కపెల్లి రమేష్, నర్సంపేట, నెక్కొండ, ఖానాపురం మండలాల కార్యదర్శులు కందిక చెన్నకేశవులు, గఠ్యం యాకయ్య, వీరునాయక్, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు పాలక కవిత, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు మియాపురం గోవర్ధన్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఐత యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.